

» బాలా త్రిపుర సుందరీదేవిగా..

మహేశ్వరం, అక్టోబరు 4 : మహేశ్వరం రాజరాజేశ్వరాలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు శుక్రవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, ఫలరసాభిషేకం, సహస్రనామార్చన, మంత్రపుష్పంతో పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కుమార్ పాల్గొన్నారు.



» బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

షాద్‌నగర్, అక్టోబరు 4: పట్టణంలోని ఎస్‌వీపీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి కళాశాల ఆవరణలో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారం చంద్రశేఖర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



» పాహిమాం జగన్మాతా..

ఆమనగల్లు, అక్టోబరు 4 : పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి, కాళీమాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మాజీ ఎంపీపీ తల్లోజు లలితవెంకటయ్య కౌన్సిలర్ విజయ్‌కృష్ణ, యాదగిరి, పుల్లయ్య, జంగాచారి, రాజశేఖర్, మాదవాచారి, నర్సింహ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిలో అగ్రసేన్ మహారాజ్ బోధనలది ప్రముఖపాత్ర

» డీజీపీ జితేందర్ » శంషాబాద్‌లో అగ్రసేన్ మహారాజ్ జయంతి వేడుకలు



డీజీపీని సన్మానిస్తున్న సమాజ్ సభ్యులు

శంషాబాద్, అక్టోబరు 4 : రాష్ట్ర అభివృద్ధిలో అగర్వాల్ సమాజ్ అగ్రసేన్ మహారాజ్ బోధనలు ప్రముఖపాత్ర పోషిస్తున్నాయని డీజీపీ జితేందర్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని క్లాసిక్ కన్వెన్షల్ హాల్‌లో శుక్రవారం అగ్రసేన్ మహారాజ్ జయంతి ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అగ్రవాల్ సమాజ్ చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరాలతో పాటు విభిన్న కార్యక్రమాలు చేపడుతుందన్నారు. సమాజ్‌లోని సభ్యులందరూ అగ్రసేన్ మహారాజ్ బోధనలకు కట్టుబడి ఉండటం గొప్ప విషయమన్నారు. అగర్వాల్ సమాజ్ ప్రెసిడెంట్ మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ అగర్వాల్ సమాజ్ కమ్యూనిటీ కార్యక్రమాల అమలులో సహకరించిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. 1998లో స్థాపించబడిన అగర్వాల్ సంఘం ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

సర్వేలో పొరపాట్లకు తావుండొద్దు


సర్వే వివరాల నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిభట్ల, అక్టోబరు 4 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే కార్యక్రమంలో పొరపాట్లకు తావుండొద్దని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. ఆదిభట్ల గ్రామంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణతో కలిసి సర్వేను పర్యవేక్షించారు. గ్రామ ప్రజలతో ఆమె మాట్లాడారు. సర్వేకు సహకరించి పూర్తి వివరాలు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ కుటుంబం వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఒకవేళ ఎవరైనా అందుబాటులో లేకుంటే ఫోన్‌లో సంప్రదించాలని తెలిపారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

చేవెళ్ల, అక్టోబరు 4 : చేవెళ్లలో నిర్వహించే ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.... ఈనెల 5వ తేదీన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చేపడుతున్న సమ్మేళనానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు హాజరు కానున్నారని తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే యాదయ్య కోరారు. ఈ సమావేశంలో మండల సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, వసంతం, వీరేందర్‌రెడ్డి, నరేందర్, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంకని నిర్లక్ష్యం!



భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడుగుంతల నిర్మాణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రతీ ఇంటిలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించినా తూతూమంత్రంగా నిర్మాణాలు జరిగాయి. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరగడంతో ఈ పథకం మధ్యలోనే నిలిచిపోయింది. 2023లో ఇంకుడు గుంతలతో పాటు కమ్యూనిటీ సోక్‌పిట్ నిర్మాణాలు లక్ష్యాన్ని చేరుకోలేక పోయింది.

» ముందుకు సాగని ఇంకుడు గుంతల నిర్మాణం
» బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
» ఆసక్తిచూపని లబ్ధిదారులు
» ఈ ఏడాది వీటిని విస్మరించిన అధికారులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ : ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటేనే కొత్తనిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలనేది ప్రభుత్వ నిబంధన. జిల్లాలో ఇది ఎక్కడా అమలు కావడం లేదు. నీటిని పొదుపు చేసుకోవాలని చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. ఇంటి నిర్మాణాల సమయాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకుంటే భూగర్భ జల మట్టం పెరిగి బోర్ల ద్వారా నీరు పుష్కలంగా వచ్చే అవకాశం ఉంటుంది. గృహ నిర్మాణానికి అనుమతి దరఖాస్తు చేసుకున్న సమయంలో విధిగా ఇంకుడుగుంత నిర్మించినట్లు ధ్రువపత్రం పొందాలి. అప్పుడే ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వాలి. అయితే ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు.

నిర్మాణాల్లో నిర్లక్ష్యం..

అధికారులు పట్టించుకోకపోవడంతో ఇంకుడు గుంతల నిర్మాణాల్లో నిర్లక్ష్యం నెలకొంది. జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2023లో జిల్లాకు 2790 ఇంకుడు గుంతలు (వ్యక్తిగత, సామూహిక) నిర్మించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇందులో 876 కమ్యూనిటీ సోక్‌పిట్‌లు నిర్మించాలని అధికారులు గుర్తించారు. కానీ, 134 మాత్రం పూర్తిచేశారు. అలాగే ఇంటింటికీ 876 ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉండగా, అందులో 134 మాత్రమే పూర్తి చేశారు.

బిల్లులు ఇవ్వకపోవడమే కారణం?

ఇంకుడు గుంతల నిర్మించుకోవాలని, ఇందుకు అయ్యే ఖర్చు చెల్లిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో చాలామంది వీటి నిర్మాణం చేసుకున్నారు. ఏడాది అవుతున్నా అనేకమందికి బిల్లులు రాలేవు. దీంతో వీటిని నిర్మించేందుకు ప్రజలు ముందుకు రావడం లేదన్న వాదన వినిపిస్తోంది.

ఈ సారి వీటి ఊసే లేదు..

2024 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో ఇంకుడు గుంతల లక్ష్యం, గుర్తింపు వంటి అంశాలను అధికారులు విస్మరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో ఈ పథకం అనుకున్న మేర లక్ష్యాన్ని చేరుకోలేదు. ఈసారి వరుణుడు కరుణించినా వాన చుక్క భూమిలోకి ఇంకే పరిస్థితి కనిపించడం లేదు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించేందుకు అవసరమైన రీచార్జి పిట్స్ తగినన్ని లేవని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇలా నిర్మించుకోవాలి..

ఇంకుడు గుంత నిర్మాణానికి నిర్దిష్ట కొలతలు ఉంటాయి. ప్రతీ గుంత 1.2 మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పు, 1.8 మీటర్ల లోతు కలిగి ఉండాలి. అడుగు భాగంలో ఫీటున్నర మందం బెండడు రాళ్లు, దానిపైన 40 ఎంఎం ఫీటున్నర కంకర, వాటిపైన 3 ఫీట్ల రింగ్‌ను అమర్చాలి. పైన మూత ఏర్పాటు చేసి 5 మీటర్ల పైపును బిగించాలి. డ్రమ్ము పక్కన ఖాళీ స్థలంలో ఇరుపక్కల 20ఎంఎం కంకర నింపాలి. మొదట గుంత తవ్వగా వచ్చిన మట్టిని నీటి ప్రవాహానికి అడ్డంగా, అవతలి భాగంలో కట్ట రూపంలో పోయాలి. ఇంకుడు గుంత చుట్టూ సిమెంట్ ప్లాస్టరింగ్ చేస్తే గుంత పూడిపోకుండా ఉంటుంది.

సామూహిక ప్రాంతాల్లో ఇలా..?

సామూహిక ప్రాంతాల్లో 2 మీటర్ల పొడవు, 2మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతు గుంత తవ్వాలి. అడుగు భాగంలో 3 అడుగుల వరకు 225 ఎంఎం కంకర రాళ్లతో నింపాలి. పైభాగంలో 30 సెంటీమీటర్లు 20 ఎంఎం కంకర రాళ్లతో ఇసుక మిశ్రమంతో నేల సగభాగం నింపాలి.

ఇంకుడు గుంతల వివరాలు (2023 సంవత్సరం)

మండలం	జీపీల సంఖ్య	గుంతల లక్ష్యం	సోక్‌పిట్ గుర్తింపు	సోక్‌పిట్ నిర్మాణం పూర్తి	ఇంకుడు గుర్తింపు	నిర్మాణం పూర్తయినవి
అబ్దుల్లాపూర్‌మెట్	18	90	70	46	35	19
ఆమనగల్లు	13	65	16	0	25	03
చేవెళ్ల	37	185	30	0	06	04
చౌదరిగూడ	24	120	33	3	25	15
ఫరూఖ్‌నగర్	47	325	30	0	14	04
ఇబ్రహీంపట్నం	14	70	36	2	72	15
కడ్తాల్	24	120	30	12	50	15
కందుకూర్	35	175	68	2	45	04
కేశంపేట్	29	145	29	0	07	02
కొందుర్గు	22	110	62	3	35	05
కొత్తూరు	12	60	18	5	35	10
మాడ్గుల	33	165	52	5	56	18
మహేశ్వరం	31	155	62	0	15	0
మంచాల	23	115	07	0	05	02
మొయినాబాద్	28	140	57	5	23	0
నందిగామ	18	90	44	0	20	01
షాబాద్	41	205	30	0	25	0
శంషాబాద్	27	135	31	1	22	02
శంకర్‌పల్లి	26	130	49	38	43	22
తలకొండపల్లి	32	160	45	0	27	03
యాచారం	24	120	77	12	60	26



ఇప్పటికీ బిల్లు రాలేదు

ఇంకుడు గుంత నిర్మించుకోవాలని అధికారులు హడావిడి చేశారు. నిర్మించుకుంటే కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. అప్పుచేసి మరీ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకున్న. ఇప్పటివరకూ బిల్లు ఇవ్వలేదు.

- పిట్ల రత్నయ్య, తుమ్మలపల్లి గ్రామం, జిల్లేడు చౌదరిగూడ మండలం

ఇంటి స్థలం.. ఇప్పటికీ ఇవ్వలే!

» యాచారం మండలంలో విరివిగా ప్రభుత్వ భూమి
» అద్దెలు చెల్లించలేక పేదలు అవస్థ
» ఆందోళనలు చేపట్టినా కనికరించని అధికారులు


చిన్నతూండ్లలో పేదలకు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం

యాచారం, అక్టోబరు 3 : పేదలు గూడు లేక గోస తీస్తున్నారు. చేసిన కష్టం అద్దె చెల్లించడానికే సరిపోతుందని, ఇక భార్యాపిల్లలను సాకేదెలా అని బోరుమంటున్నారు. ప్రభుత్వ భూమి కావాల్సినంత ఉన్నా.. అందులో పేదలకు ఇంటి స్థలం కేటాయించడానికి ప్రజాప్రతినిధులకు, అధికారులకు మనసు రావడం లేదని విలపిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప ఇంటి స్థలం కోసం నిరుపేదలకు ఎదురుచూపు తప్పడం లేదు. ఏళ్లతరబడి స్థలాలు ఇవ్వాలని వినతులు సమర్పించినా, ఆందోళనలు చేపట్టినా పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలకు గత ప్రభుత్వం డబుల్‌బెడ్రూంలు ఇస్తామని ఆశ చూపి ఒక్క ఇంటిని కూడా కట్టి ఇవ్వలేదు. ఈ ప్రభుత్వమైనా ఇంటి స్థలాలు కేటాయిస్తే అందులో గుడిసె వేసుకొనైనా పబ్బం గడుపుతామని వాపోతున్నారు.

ప్రభుత్వ స్థలాలున్నా...

యాచారం మండలంలో ప్రభుత్వ భూములకు కొదవ లేదు. అనేక గ్రామాల్లో ఖాళీగా ఉన్న సర్కార్ స్థలాలు ఉన్నాయి. 2006 నుంచి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతులు అందిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తున్నారు. కానీ ఒక్కరికీ ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు లేవు. తక్కళ్లపల్లిలో అప్పటి మంత్రి పి.మహేందర్‌రెడ్డి జనావాసాలకు దూరంగా డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కానీ ఇప్పటివరకు అక్కడ పనులు మొదలే కాలేదు. అదేవిధంగా సర్వేగూడలో సీపీఎం ఆధ్వర్యంలో (2006లో) గుడిసెలు వేశారు. అందులో పంటలు సాగు చేస్తున్న రైతు ఆ భూమిని ఇచ్చేది లేదని తేల్చి చెప్పాడు. దీంతో పట్టా సర్టిఫికెట్లు అధికారులు జారీ చేయలేకపోయారు. చిన్నతూండ్లలోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిలో 35మందికి (2007లో) పట్టాలిచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో అందులో ఎవరూ ఇళ్లు కట్టుకోలేదు. సర్టిఫికెట్ పొందిన మూడు నెలల్లో ఇల్లు కట్టుకోకపోవడంతో ఆ భూమి ఎవరికీ చెందకుండా పోయింది. ప్రస్తుతం ఆ భూమిలో రెండు క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. చౌదర్‌పల్లిలో 77 సర్వే నంబర్‌లో రెండెకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో అంగన్‌వాడీ భవనం, రైతు వేదిక నిర్మించారు. ఇంకా పది మంది ఇళ్లు కట్టుకునేంత స్థలం ఉన్నా ఎవరికీ కేటాయించడం లేదు. చౌదర్‌పల్లి గేటు వద్ద ఉన్న రెండు ఎకరాల భూమిలో కొందరు నామమాత్రంగా ఇళ్లు కట్టుకున్నారు. కానీ వాటిల్లో ఎవరూ ఉండటం లేదు. కుర్మిద్దలో సర్వే నంబర్ 2లో మూడు ఎకరాల భూమి ఉంది. నందివనపర్తిలో సర్వే నంబర్ 2లో రెండెకరాల 27 గుంటల భూమి ఉంది. ఇందులో 11కేవీ సబ్‌స్టేషన్ నిర్మించారు. ఇంకా మిగిలిన భూమిని పేదలకు కేటాయించవచ్చు. నానక్‌నగర్‌లో సర్వే నంబర్ 30లో మూడు ఎకరాల 21 గుంటల భూమి ఉంది. తాటిపర్తిలో 104 సర్వే నెంబర్‌లో ఆరు ఎకరాల భూమి ఉంది. మాల్‌లో 640 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉంది. ఇంత సర్కార్ స్థలం ఉన్నా పేదలకు ఎందుకు కేటాయించడం లేదని ఇల్లు లేనివారు ప్రశ్నిస్తున్నారు. విలువైన భూములను కబ్జాకు గురవుతున్నా అధికారులు మిన్నకుంటారే తప్ప, పేదలకు ఇవ్వాలని ఆలోచన మాత్రం చేయడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.



ఇంటి స్థలం ఇచ్చి ఆదుకోవాలి

గ్రామంలో చాలామందికి ఇళ్లు లేవు. అధికారులు మాకు ఇంటిస్థలం ఇచ్చి ఆదుకోవాలి. ఉన్న ఇంట్లోనే పార్టీషన్ చేసుకొని ఉంటున్నాం. క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసిన స్థలంలో పేదలకు ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. లేదంటే గ్రామంలో పట్టా భూమిని ప్రభుత్వం కొని పేదలకు పంపిణీ చేయాలి. - మస్కు నర్సింహ చిన్నతూండ్ల

నూతన కార్యవర్గం ఎన్నిక

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొప్పున మోని శ్రీనివాసులు


ఎన్నిక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాసులు

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 4 : తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొప్పున మోని శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్ రామాంజనేయులు, జనరల్ సెక్రటరీగా సునీల్‌రాజ్, కోషాధికారిగా నామాల శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం పోరాడేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేత ఏలూరు శ్రీనివాస్‌రావు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కలిముద్దీన్ హైమద్, ఎన్నికల ప్రధాన అధికారి శ్యామ్, ఉప ఎన్నికల అధికారి డాక్టర్ రామారావు, రంగారెడ్డి జిల్లా టీజీవో అధ్యక్షుడు రామారావు, సిద్దిపేట జిల్లా టీజీవో అధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి కూతురికి మెడిసిన్ సీటు

లక్ష రూపాయల ఆర్థిక సాయం ప్రకటించిన మాజీ ఎంపీపీ కుమారుడు


హిందు

చేవెళ్ల, అక్టోబరు 4 : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన కందవడ హిందు మెడిసిన్ సీటు పొందారు. 720 మార్కులకు గాను 466 మార్కులు సాధించిన ఆమెకు వరంగల్ కాళోజి మెడికల్ యూనివర్సిటీలో అడ్మిషన్ లభించింది. అయితే ఈమె తండ్రి సాయన్న చేవెళ్ల గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తుంటాడు. అయితే హిందు ఫ్రీ సీటు సాధించడంపై చేవెళ్ల ప్రజలు, నాయకులు అభినందించారు. కాగా హిందు చదువు కోసం చేవెళ్ల మాజీ ఎంపీపీ విజయలక్ష్మిరమణారెడ్డి కుమారుడు, బీజేపీ జిల్లా యువ నాయకుడు మల్లారి వైభవ్‌రెడ్డి లక్ష రూపాయల ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మొత్తాన్ని శనివారం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

డీఎస్సీ నియామకాల్లో ఎస్టీ వాటాను పక్కన పెట్టాలి



కులకచర్ల, అక్టోబరు 4: డీఎస్సీ నియామకాల్లో ఎస్టీ వాటాను పక్కన పెట్టాలని తెలంగాణ ఆదివాసీ చెంచు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కల అంజిలయ్య, ప్రధాన కార్యదర్శి చెంచు హనుమంతు అన్నారు. స్థానిక తహసీల్దార్ మురళీధర్‌కు శుక్రవారంవారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ ఎస్టీ వర్గీకరణ చేపట్టి డీఎస్సీ 2024 నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని తెలిపారు. అందుకు విరుద్ధంగా డీఎస్సీ నిర్వహించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ చెంచు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి


మల్‌రెడ్డిపల్లిలో డిజిటల్‌కార్డు సర్వే నెంబర్ పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

తాండూరు, అక్టోబరు 4: తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్‌కార్డు సర్వేను వేగవంతం చేయాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాండూరు పట్టణం మల్‌రెడ్డి పల్లిలో 1వ వార్డులో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. పీడీఎఫ్ డేటా ఆధారంగా కుటుంబాలనుగుర్తించి సర్వే చేయాలని సూచించారు. సర్వేను వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన వాటిపై సబ్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. రెండో రోజు సర్వే కొనసాగింది. పాత డేటాలో వివరాలు సరిపోయే? మార్పులు? తొలగింపులు? వంటి వాటిని పరిశీలించారు. పూర్తి వివరాలు పూర్తయ్యాక ఫ్యామిలీ ఫోటోలు తీశారు. సర్వే కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, బృందం సభ్యులు కపిల్, శారదారెడ్డి, రవీందర్, రాములు, యాదగిరి, అర్పి స్వప్న, తదితరులు ఉన్నారు. ఈ సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ పరిశీలించారు.

సేంద్రియ పద్ధతిలో పంటల సాగు మేలు


ధర్మపూర్‌లో పంటలను ఆన్‌లైన్ నమోదు చేస్తున్న మోహన్‌రెడ్డి

కొడంగల్ రూరల్, అక్టోబరు 4: రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేయడం మేలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ధర్మపూర్ గ్రామశివారులో శుక్రవారం రైతులు సాగు చేసిన కంది, పత్తి పంటలను ఏఈవో ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో అధిక మోతాదులో రసాయన ఎరువులను పిచికారి చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో దేవేందర్, రైతులు పాల్గొన్నారు.

కులకచర్ల: రైతులు పంటల సాగులో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం రైతులు సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించారు. పంటల సాగు విధానంలో రైతులకు సలహాలు, సూచనలు చేశారు. పత్తి, కంది పంటల సాగుపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వీరస్వామి, ఏఈవో విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

జిల్లాలో గాడితప్పిన పోలీస్ వ్యవస్థ

- అక్రమార్కులతో పలువురు చెట్టాపట్టాల్
- స్టేషన్‌లలోనే భూ పంచాయితీలు
- ఉన్నతాధికారులు హెచ్చరించినా మారని తీరు
- ఒకేసారి ఐదుగురు అధికారులపై వేటు
- ముగ్గురు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలపై చర్యలు
- జిల్లా పోలీస్ శాఖలో కలకలం

వికారాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒకేసారి ఐదుగురు పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఒక సీఐపై సస్పెన్షన్, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలపై బదిలీ వేటు పడడం పోలీసు శాఖలో కలకలం రేపింది. ఒకేసారి ఐదుగురు పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవడం జిల్లా పోలీసు చరిత్రలో ఇదే మొదటిది కావడం గమనార్హం. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా లా అండ్ ఆర్డర్‌ను పకడ్బందీగా అమలు చేస్తూ.. న్యాయం కోసం తమ వద్దకు వచ్చే బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంబంధం లేని వ్యవహారాల్లోనూ తలదూరుస్తూ అడ్డంగా బుక్ అవుతున్నారు.

అక్రమార్కులకు మద్దతు..

పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తూ మట్కా, గ్యాంబ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం ఆదేశించినా.. కిందిస్థాయిలో పనిచేసే పోలీసు అధికారుల్లో కొందరు అక్రమార్జనకు అలవాటుపడి ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారితో అంటకాగుతున్న పోలీసులపై ఉన్నతాధికారులు నిఘా ఉంచారు. ఈ విషయం తెలియని వారు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే ధైర్యంతో అక్రమార్కులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా అంటకాగినట్లు గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకున్నారు.

మరికొందరిపై వేటుకు అవకాశం!

తాండూరు సబ్ డివిజన్ పరిధిలో తాండూరు టౌన్ సీఐ సంతోష్‌కుమార్, తాండూరు రూరల్ సీఐ అశోక్‌లను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయగా, పెద్దేముల్ ఎస్‌ఐ గిరన్న, యాలాల ఎస్‌ఐ శంకర్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. మరో ఎస్‌ఐని నేడో, రేపో ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసే అవకాశం ఉందని సమాచారం. ఇదిలా ఉండగా, వికారాబాద్ సీఐ నాగరాజుపై సస్పెన్షన్ వేటు పడింది. తాను జోగిపేట సీఐగా పనిచేస్తున్న సమయంలో మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితులను తప్పించే ప్రయత్నం చేశారనే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. అలాగే జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండే ఓ ఎస్‌ఐ తన పరిధి దాటి వ్యవహరిస్తున్నారనే విషయం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. మరికొందరు పోలీసు అధికారులపై వేటు పడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

స్టేషన్‌లోనే పంచాయితీలు

జిల్లాలో కొందరు పోలీసు అధికారులు పోలీసు స్టేషన్లలోనే పంచాయతీలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. భూముల విక్రయాలు ఎక్కువగా జరిగే పట్టణాల్లో కొందరు పోలీసు అధికారులు సివిల్ వ్యవహారాల్లో రియల్ వ్యాపారులకు మద్దతుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తమ చేతికి మట్టి అంటకుండా మధ్యవర్తులతో వ్యవహారం నడిపిస్తున్న పోలీసు అధికారులు ఇంత కాలం తమకేమీ కాదనే ధీమాతో ఉన్నారు. వసూళ్ల పర్వంలో నేరుగా పాలుపంచుకోకుండా మూడో వ్యక్తి ద్వారా వ్యవహారం నడుపుతున్నారు. జిల్లాలో పక్కదారి పట్టిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నా.. కొందరు ఇంకా తమ పనితీరు మార్చుకోవడం లేదని తెలుస్తోంది. జిల్లాలో పోలీసు శాఖ పనితీరును మెరుగు పరిచేందుకు ఎస్పీ తన దృష్టికి వచ్చిన సంఘటనలు, అంశాలపై విచారణ జరిపిస్తూ.. తప్పుతేలితే చర్యలు చేపడుతున్నారు. ఉన్నతాధికారుల చర్యలతోనైనా అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్న పోలీసుల పని తీరులో మార్పువస్తుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లా రవాణాశాఖ ఆదాయం రూ.1,436కోట్లు

- రాష్ట్ర వార్షిక ఆదాయంలో 45 శాతం
- ఉప రవాణా కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్


మాట్లాడుతున్న చంద్రశేఖర్‌గౌడ్

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 4: ఉమ్మడి జిల్లాలోని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలు ఏడాది కాలంలో సంయుక్తంగా రూ.1,436 కోట్లు ఆదాయాన్ని సాధించాయని ఉమ్మడి జిల్లా ఉప రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ వెల్లడించారు. శుక్రవారం మూడు జిల్లాల రవాణాశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా రూ.802 కోట్లు, మేడ్చల్-మల్కాజిగిరి రూ.595 కోట్లు, వికారాబాద్ రూ.39 కోట్ల చొప్పున ఆదాయం సాధించాయన్నారు. ఈ ఆదాయం రాష్ట్ర ఆదాయం రూ.3,195 కోట్లలో 45శాతంగా ఉందని తెలిపారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు వెంటనే పన్నులు చెల్లించాలన్నారు. లేని పక్షంలో పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే ఓవర్‌లోడ్‌తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల రవాణా శాఖ అధికారులు సుభాష్ చందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సుశీల్‌రెడ్డి, నవీన్, వాసు, కృష్ణవేణి, మున్ని, అనూష, ఉపాసిని తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న అంజయ్య యాదవ్, నవీన్‌రెడ్డి

షాద్‌నగర్, అక్టోబరు 4: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్, టెన్నిస్ బాల్ పోటీలను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని చెప్పారు. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్ పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు పెద్దపీట


పనులు ప్రారంభిస్తున్న నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, అక్టోబరు 4 : ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలకు కల్పనకు పెద్దపీటవేస్తున్నట్లు ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 4,6,11వ వార్డుల్లో కౌన్సిలర్లు కుంట్ల మౌనిక ఉదయ్ పాల్‌రెడ్డి, కృష్ణం రాజులతో కలిసి శుక్రవారం రూ.35లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మాణం, వాటర్ పైపులైన్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. డీఈ వెంకన్న, ఏఈ వీరాంజనేయులు, గ్రామ పెద్దలు, నాయకులు కొప్పు జంగయ్య, రాములు, మల్లేష్, వసంత పాల్గొన్నారు.

నేడు శంషాబాద్‌లో పురపాలక సంఘ కార్యాలయం ప్రారంభం

శంషాబాద్, అక్టోబరు 4 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని సిప్లెక్స్ చౌరస్తాలో కొత్తగా నిర్మించిన పురపాలక సంఘం కార్యాలయాన్ని నేడు(శనివారం) పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, శంషాబాద్ పురపాలక సంఘం కార్యాలయం ప్రస్తుతం శంషాబాద్ పాత గ్రామపంచాయతీ కార్యాలయంలోనే కొనసాగుతోంది.

చెరువులో పడి ముగ్గురు చిన్నారులు మృతి


- మత్స్యకారుల గాలానికి చిక్కిన మృతదేహాలు
- మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలంలో దుర్ఘటన


రోదిస్తున్న తల్లిదండ్రులు

మూడుచింతలపల్లి, అక్టోబర్ 4 : ఈత సరదా అభంశుభం తెలియని ముగ్గురు చిన్నారులను బలిగొంది. దసరా సెలవుల్లో సరదాగా గడపాల్సిన చిన్నారులు చెరువు వద్ద ఆడుకోవడానికి వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి ఈత రాక నీట మునిగి దుర్మరణం చెందారు. ముక్కుపచ్చలారని చిన్నారుల మృతదేహాలను చూసిన తల్లిదండ్రులు, గ్రామస్థులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ దుర్ఘటన శుక్రవారం మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కొల్తూర్ గ్రామానికి చెందిన మటన్ దుకాణం నిర్వహిస్తున్న బాలేకర్ బాలేశ్ కుమారుడు మణిహర్ష(12) అలియాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్ లో 7వ తరగతి చదువుతున్నాడు. గ్రామానికి చెందిన సలేంద్ర కనకరాజు, లావణ్య దంపతుల కుమారుడు హర్షవర్దన్ (10) లాల్‌గడి మలక్‌పేట్‌లోని సరస్వతీ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. వీరబోయిన స్వామి, శోభల కుమారుడు మనోజ్ (11) కొల్తూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. ఈ మూడు కుటుంబాలు యాదవ్ కాలనీలో పక్కపక్క ఇళ్లలో ఉంటున్నారు. దసరా సెలవులు కావడంతో శుక్రవారం ఉదయం చెరువు వద్ద సరదాగా ఆడుకోవడానికి ముగ్గురు కలిసి వెళ్లారు. ప్రమాదవశాత్తు చెరువులో పడ్డారు. ఈత రాక ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. చెరువు చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో గాలాలు వేశారు. కొద్ది సేపటికి వారి గాలాలకు నీట మునిగిన ఇద్దరి చిన్నారుల మృతదేహాలు చిక్కాయి. దీంతో చేపలు పడ్డాయని అనుకొని గాలాన్ని వారు బలంగా లాగేసరికి మృతదేహాలు బయటకు వచ్చాయి. ఈ విషయం గ్రామంలో వ్యాపించిడంతో ముగ్గురు కలిసి చెరువు వద్దకు ఆడుకోవడానికి వెళ్లడం చూసామని పలువురు చెప్పారు. దీంతో చెరువులో గాలించగా మరొక చిన్నారి మృతదేహం లభించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వారి తల్లిదండ్రులు మృతదేహాల వద్ద గుండెలు పగిలేలా ఏడుస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషాద సంఘటనను కొల్తూర్ గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేసింది.

ముమ్మరంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే


సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

షాద్‌నగర్/కొత్తూరు/శంషాబాద్ రూరల్/శంకర్‌పల్లి అక్టోబరు 4: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే వివరాల సేకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలం కడియాలకుంటతండా, కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు నివాసితుల వద్ద శుక్రవారం ఆర్డీవో వెంకటమాధవరావు వివరాలు సేకరించారు. షాద్‌నగర్ తహసీల్దార్ పార్థసారధి, కొత్తూరు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీటీ జంగయ్య పాల్గొన్నారు. సంక్షేమ పథకాల్లో అవినీతిని నిరోధించడం కోసమే ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద తూప్ర తండాలో సర్వేను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పీఏసీఎస్ చైర్మన్ శ్రవణ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, జడ్పీటీసీ తన్వీరాజు, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, రవినాయక్, మహేందర్, ఆనంద్ పాల్గొన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు రూపకల్పనలో భాగంగా శంకర్‌పల్లి పట్టణంలోని 14వ వార్డులో వివరాలు సేకరిస్తున్నామని ఆర్డీవో సాయిరాం తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని 14 వార్డు ఎంపిక శుక్రవారం సర్వే చేస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఉత్పత్తులకు ఆదరణ పెరిగింది

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపీ

తాండూరు రూరల్, అక్టోబరు 4: ప్రజల్లో సేంద్రియ ఆహార ఉత్పత్తులకు ఆదరణ పెరిగిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జినుగుర్తి సమీపంలోని ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జినుగుర్తి ఏకలవ్య ఫౌండేషన్ వంద ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయంతోపాటు వ్యవసాయ కళాశాల, గురుకుల పాఠశాల, గోశాల నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ ద్వారా రైతు సంఘాలు ఏర్పాటు చేసి సేంద్రీయ వ్యవసాయంపై శిక్షణ ఇవ్వడం మంచి పరిణామమన్నారు. అనంతరం సేంద్రియ ఉత్పత్తులతో తయారు చేసిన స్వచ్ఛమైన నెయ్యి, సబ్బులు, బెల్లం, పసుపు, బిస్కెట్లు, గోమూత్రం, ముడి బియ్యం వంటి వాటిని పరిశీలించారు. సేంద్రీయ ఉత్పత్తులను ఎంపీ కొనుగోలు చేశారు.

సాందీపని గురుకులం సందర్శన

ఏకలవ్య ఫౌండేషన్‌లో ప్రారంభమైన సాందీపని గురుకులంను ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సందర్శించారు. అక్కడే ఉన్న సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుతం ఈ ఏడాది 4వ తరగతి నుంచి తరగతులు ప్రారంభమయ్యాయని చెప్పారు. సీబీఎస్‌సీ సబ్జెక్టుతో పాటు 64కళల ఆధారంగా నాలుగు వృత్తి విద్యా కోర్సులు(యోగా, ధనుర్విద్య, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీ) నేర్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణాముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు మల్లేశం, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, కౌన్సిలర్ అంతారం లలిత, నాయకులు భద్రేశ్వర్, నరేందర్‌రెడ్డి, సందీప్, కిరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య బూతు పురాణం

బషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య బూతు పురాణం నడుస్తోందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. మండలంలోని కాశీంపూర్, బాబునాయక్ తండా, దామర్‌చెడ్, బషీరాబాద్ తదితర గ్రామాల్లో శుక్రవారం జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎంపీ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీల్లో ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో డ్రామాలు చేస్తూ ప్రజల దృష్టి మళ్లిస్తుందని మండిపడ్డారు. ప్రధాని మోదీ రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ఒక్కో రైతుకు ఏటా రూ.65వేలు లబ్ధి చేకూరుస్తుడని చెప్పుకొచ్చారు. కాశీంపూర్‌లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, జిల్లా నాయకులు రాజ్‌కుమార్‌కులకర్ణి, పార్టీ సీనియర్ నాయకులు బద్రేశ్వర్, కృష్ణాముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షులు రాఘవేందర్, జీవన్గి వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్, గంగాధర్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా
ఆదిలక్ష్మి బాధ్యతల స్వీకరణ



ఆమనగల్లు, అక్టోబరు 4: ఆమనగల్లు మండల ప్రత్యేక అధికారిగా ఆదిలక్ష్మి నియమితులయ్యారు. మహేశ్వరం వ్యవసాయ శాఖ ఏడీఏ సుజాత ఇప్పటి వరకు ఇక్కడ కొనసాగారు. ఇటీవల ఇబ్రహీంపట్నంకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఆదిలక్ష్మి నియమితులయ్యారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ బదిలీ

శంకర్‌పల్లి, అక్టోబరు 4: శంకర్‌పల్లి సీఐ హబీబుల్లా ఖాన్ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సైబరాబాదు సీపీ అవినాష్ మహంతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ శంకర్‌పల్లికి బదిలీ అయినట్లు సమాచారం. హబీబుల్లాఖాన్ శంకర్‌పల్లిలో 7నెలలు పనిచేసి స్వల్ప వ్యవధిలోనే బదిలీపై వెళ్లారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆమనగల్లు/కడ్తాల్, అక్టోబరు 4: ఆకుతోటపల్లికి చెందిన కంబాలపల్లి మునిలమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. భౌతికకాయాన్ని బీఆర్‌ఎస్ నాయకులు వల్లపు దాస్ బాలరాజ్‌గౌడ్ సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. కంబాలపల్లి బాలు, శివ, కుమార్‌రెడ్డి, బుచ్చయ్య, తదితరులున్నారు. కడ్తాల్ మండలం మైసిగండికి చెందిన కిషన్ నాయక్ అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహాన్ని కాంగ్రెస్ జిల్లా నాయకుడు జవహర్‌లాల్ నాయక్ సందర్శించి నివాళులర్పించి రూ.5 వేలు అందజేశారు. అలాగే కిషన్‌నాయక్ మృతదేహాన్ని బీజేపీ జిల్లా నాయకుడు రాందాస్‌నాయక్ సందర్శించి నివాళులర్పించారు. వ్యక్తిగతంగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ఆమనగల్లులో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలి



జడ్జికి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఆమనగల్లు, అక్టోబరు 4: ఆమనగల్లు పట్టణంలో సబ్‌కోర్టును ఏర్పాటు చేయాలని స్థానిక న్యాయవాదులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. సబ్‌కోర్టు లేకపోవడంతో షాద్‌నగర్ వెళ్లాల్సి వస్తుందని, కక్షిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అనువైన ఐదెకరాల స్థలం కేటాయించి భవనం నిర్మించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రమందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, న్యాయవాదులు లక్ష్మణశర్మ, యాదిలాల్, రామకృష్ణ, శేఖర్, మల్లేష్, జగన్, శేఖర్, గణేష్, కొప్పు కృష్ణ, సత్యం తదితరులున్నారు.

'రాహుల్ గాంధీని విమర్శించే హక్కు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులకు లేదు'

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 4 : కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీని విమర్శించే నైతిక హక్కు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు లేదని రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ తెలంగాణ చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ప్రజా పాలన సాగిస్తున్న తెలంగాణ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా స్వేచ్ఛగా ఉండటం చూసి ప్రతిపక్ష నేతలు తట్టుకోలేక పోతున్నారని తెలిపారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, ఆట స్థలాలు సహా ప్రభుత్వ ఆస్తులను కాపేడుందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని దీని పరిధి ప్రాంతాన్ని హైడ్రాకు అనుసంధానం చేస్తూ హైడ్రా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్తుల పరిరరక్షణ విభాగం, విపత్తు నిర్వహణ విభాగాలు పని చేస్తున్నాయన్నారు. మూసీ పరిరక్షణలో ఎవరైనా పేదవారు నష్టపోతే ప్రభుత్వం వారికి తప్పకుండా పునరావాసం కల్పిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

6న రెడ్డి ప్రజాప్రతినిధులకు సన్మానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న జేఏసీ నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 4: రెడ్డి జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రెడ్డి ప్రజాప్రతినిధులకు ఈనెల 6న ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా రెడ్డి జేఏసీ అధ్యక్షుడు లిక్కి శ్రీనివాస్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు లిక్కి అనురుద్రారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు వేలపాటి సంధ్యారెడ్డిలు తెలిపారు. ఈమేరకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి రెడ్డి జేఏసీ నాయకులు హైదరాబాద్‌లోని ఆయన్ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొందుర్గు రెడ్డి సేవాసమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెడ్డి సేవాసమితి సభ్యుల సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసిన మధుసూదన్‌రెడ్డి

గడ్డి అన్నారం మార్కెట్ చైర్మన్‌గా నియమితులైన చిలుక మధుసూదన్‌రెడ్డి శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈనెల 5న నిర్వహించే తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని కసిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, ఫరీద్, బాబా, మోతిలాల్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా శివశంకర్

ఆమనగల్లు, అక్టోబరు 4: సీపీఎం ఆమనగల్లు మండల కార్యదర్శిగా శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో సీపీఎం మహాసభ నిర్వహించారు. ఏరియా కన్వీనర్ కానులు వెంకటయ్య, ఏరియా కమిటీ మెంబర్ గుమ్మడి కురుమయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. సీపీఎం నూతన కమిటీని ఎన్నుకున్నారు. శివశంకర్‌ను సత్కరించారు. గజ్జి మల్లేశ్, పట్టం నర్సింహ, పుట్టి యాదయ్య, తదితరులు ఉన్నారు.

తండాల అభివృద్ధికి కృషి : వీర్లపల్లి

కేశంపేట, అక్టోబరు 4: మారుమూల గిరిజన తండాల అభివృద్ధే లక్ష్యంగా బీటీ రోడ్లు వేస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కేశంపేట ప్రధాన రహదారి నుంచి బలిజరాళ్ల తండాకు రూ.65లక్షలు, తొమ్మిదిరేకుల ప్రధాన రహదారి నుంచి బాల్యతండాకు రూ.2కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు పనుల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మండలాధ్యక్షుడు వీరేశ్, మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, జగదీశ్వరప్ప, శ్రీధర్‌రెడ్డి, లంకాల సురేశ్‌రెడ్డి, రూప్లానాయక్, గిరిధర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : వాటర్ ఫిల్టర్ ప్రారంభించిన అనంతరం గిరిజనులతో ఎమ్మెల్యే శంకర్, దాత శశివర్ధన్‌రెడ్డి

కాగా, గిరిజనులకు ఫిల్టర్ వాటర్ తాపడం అభినందనీయమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామ పంచాయతీ బాల్య తండాలో మంగళగూడెం గ్రామానికి చెందిన వ్యాపారి కొట్టం శశివర్ధన్‌రెడ్డి తన తండ్రి లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించి, తండా వాసులకు తాగు నీటిని అందించారు. తండాలో తాగునీటికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించిన శశివర్ధన్‌రెడ్డి వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆయన సేవాకార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని కితాబిచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, కాంగ్రెస్ ఆదివాసీ, గిరిజన మండలాధ్యక్షుడు రూప్లానాయక్, జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి, జగదీశ్వరప్ప, శ్రీధర్ రెడ్డి, సురేష్ రెడ్డి, గిరిధర్ యాదవ్, కొట్టం వెంకట్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రవినాయక్, శ్రీను నాయక్, పర్వతాలు, రాములు, భాస్కర్ గౌడ్, అనుమగళ్ల రమేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాలయాపన చేయకుండా కష్టపడి చదవండి

కేశంపేట : గ్రామీణ ప్రాంత విద్యార్థులు కాలయాపన చేయకుండా కష్టపడి చదవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ సయ్యద్‌అబ్దుల్ హమీద్, మాజీ జడ్పీటీసీ విశాల, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య, మండలాధ్యక్షుడు వీరేశ్, మాజీ సర్పంచ్‌లు జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రవాణా సౌకర్యం బాగుంటేనే గ్రామాల అభివృద్ధి

షాద్‌నగర్ రూరల్ : రవాణా సౌకర్యం బాగుంటేనే గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల శివారులోని గొల్లకుంటతండా, జీడిగడ్డ తండాలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గొల్లకుంటతండాకు రూ.75లక్షలు, జీడిగడ్డతండాకు రూ.కోటీ 20 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు నర్సింహారెడ్డి, జాంగారి రవి, జంగయ్య, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి చిరస్మరణీయులు : సబితారెడ్డి

చేవెళ్ల/శంషాబాద్ రూరల్/శంకర్‌పల్లి/మంచాల, అక్టోబరు 4 : ఇంద్రారెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిన చిరస్మరణీయుడని, ఆయన కుటుంబానికి రాజకీయ జీవితం ఇచ్చిన చేవెళ్ల ప్రాంత ప్రజలకు మా కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. దివంగత మాజీ హోం మంత్రి ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి, కౌకుంట్ల గ్రామంలోని ఇంద్రారెడ్డి సమాధిపై కుమారులు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, కోడళ్లు, మనుమరాళ్లు అక్షయిని, మనుమడు ఇంద్ర, కుటుంబ సభ్యులతో పాటు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, చేవెళ్ల ప్రజాప్రతినిధులతో తదితరులతో కలిసి సబితారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీపీలు బాల్‌రాజ్, విజయలక్ష్మీరమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శులు హన్మంత్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఇనాయత్, సీనియర్ నాయకులు దేశమొళ్ల ఆంజనేయులు, నాగుల్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, మాధవరెడ్డి, మాధవగౌడ్, కృష్ణ, సురేందర్, దయాకర్, శివకుమార్, మండలాల నాయకులు కార్యకర్తలున్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించారు. నాయకులు



చేవెళ్ల/శంషాబాద్ రూరల్ : కౌకుంట్లలో ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సబితారెడ్డి, పాల్మాకులలో ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్తీక్‌రెడ్డి, సతీష్, జయమ్మశ్రీనివాస్

కృష్ణారెడ్డి, పాండుగౌడ్, నర్సింలు నాయకులు, కార్యకర్తలున్నారు. కాగా, ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దామని బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. శంషాబాద్ మండలం పాల్మాకులలో ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహానికి స్థానిక నాయకులు బుర్కుంట సతీష్, మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మశ్రీనివాస్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శ్రవణ్‌కుమార్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, వెంకట్‌రెడ్డి, కృష్ణగౌడ్, రాజునాయక్ తదితరులున్నారు. ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని శంకర్‌పల్లి మండల ఇంద్రన్న యువసేన అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ అన్నారు. కొత్తపల్లిలో ఇంద్రారెడ్డి విగ్రహానికి పలువురు నాయకులతో కలిసి నివాళులర్పించారు. పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిన ఇంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ రాష్ట్రనేతలు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ముచ్చర్ల వెంకటేష్ యాదవ్‌లు అన్నారు. మంచాల మండలంతో పాటు ఆరుట్లలో ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, చీమల జంగయ్యయాదవ్, రావుల భాషా, తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేదెప్పుడు'?

చేవెళ్ల, అక్టోబరు 4 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేదెప్పుడని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి ఇరుకుగా ఉండటంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణకు నోచుకోవడం లేదని ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనం అందరినీ కదిలివేసిందని చెప్పారు. రోడ్డు విస్తరణ కోసం గత బీఆర్‌ఎస్ పాలనలోనే టెండర్ వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గానికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం సైతం ఇదేనని అన్నారు. అభివృద్ధి కోసం పార్టీ మారిన ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డిలు అధికార పార్టీలో ప్రాతినిధ్యం వహిస్తున్నా రోడ్డు విస్తరణకు నోచుకపోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పనులు చేపట్టకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. రాబోయే 15 రోజుల్లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించకపోతే నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలు ప్రభుత్వ బాధ్యతారహితంతోనేనని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



జన్మదిన వేడుకల్లో కేఎల్లార్, భాస్కర్‌రెడ్డి

ఘనంగా బొక్క జంగారెడ్డి
జన్మదిన వేడుకలు

కందుకూరు, అక్టోబరు 4: మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తుమ్మలూరు మ్యాక్ ప్రాజెక్టులో జంగారెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, పాల్గొని జంగారెడ్డిని గజమాలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా జంగారెడ్డి మండల ప్రజలకు చేసిన సేవలు మరువలేమన్నారు. మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, నాయకులు అమరేందర్ రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, లచ్చానాయక్, రాణాప్రతాప్‌రెడ్డి, ఎస్.పాండు, ఎస్.జగన్, డిల్లీ శ్రీధర్, రూప్లానాయక్, బొక్క సంజీవరెడ్డి, ఎండీ ఖదీర్, భూపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అనేగౌని పాండుగౌడ్, ఎస్.వెంకట్‌రాంరెడ్డి, రాంరెడ్డి, ఎస్.జైపాల్‌రెడ్డి, నర్సింహచారిలతో పాటు వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొని జంగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా గూడూరు శ్రీనివాస్ రెడ్డి బర్త్‌డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, అక్టోబరు 4: డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం కడ్తాల మండల కేంద్రంలో అట్టహాసంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ అధ్యక్షతన బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. పలుచోట్ల నాయకులు మొక్కలు నాటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనివాస్ రెడ్డికి ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, వంశీకృష్ణ, శంకర్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, టీఎఫ్ఐడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు లక్‌పతినాయక్, జహంగీర్‌బాబా, రాంచందర్‌నాయక్, గురిగళ్ల లక్ష్మయ్య, యాదగిరిరెడ్డి, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గురిగళ్ల లక్ష్మయ్యలు మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మల్లేశ్‌గౌడ్, బిక్షపతి, జహంగీర్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో ఆయన పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తుర్కలపల్లికి చెందిన మల్లమ్మకు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు.

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మండలంలోని పాలమాకుల-ముచ్చింతల రోడ్డు నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ కోరారు. ఈమేరకు కలెక్టర్ శశాంకను కలిసి వినతి పత్రం అందించారు.

తలకొండపల్లి : తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ మంచినీటి సహాయకులకు నీటి నాణ్యత, పర్యవేక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల మంచి నీటి సహాయకులు పాల్గొన్నారు. ఎంపీవో రఘు, ఏఈలు, శిక్షకులు తదితరులున్నారు.

ఆమనగల్లు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తోందని సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్ కానుగుల వెంకటయ్య అన్నారు. జమిలీ ఎన్నికల పేరుతో ఫెడరల్ వ్యవస్థను రద్దు చేయాలని చూస్తుందని పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన మహాసభలో వెంకటయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను వీడాలన్నారు. సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు గుమ్మడి కురుమయ్య, కార్యదర్శి శివశంకర్, సభ్యులున్నారు.

మహేశ్వరం : సంపూర్ణ ఆరోగ్యానికి మించిన సంపదమరొకటి లేదని, ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై దృష్టి సారించినప్పుడే ఆ కుటుంబం, సమాజం బాగుంటుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. మండల కేంద్రంలో ఓనస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్యశిబిరంలో పాల్గొన్న కేఎల్లార్ వైద్యపరీక్షల అనంతరం మాట్లాడారు. కార్పొరేట్ ఆసుపత్రులు కూడా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి గ్రామీణ పేదలకు వైద్యసేవలు అందించి, మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, అల్లె కుమార్, రఘుపతి, రాజునాయక్, మురళీధర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవినాయక్ ఉన్నారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని ద్వారపాలకులుగా ఉన్న ఆంజనేయస్వామి, గరుత్మంతుడి ఆలయాల పునఃనిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు పూజ చేశారు. పూజారి శ్రీనివాసచార్యులు, కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : రజక సంఘం చేవెళ్ల మండల నూతన అధ్యక్షుడిగా వై.శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చేవెళ్ల గ్రామానికి చెందిన వై.శివకుమార్, ఉపాధ్యక్షులుగా మల్లేష్, ప్రభాకర్, రాజు, రమేశ్, శ్రీనివాస్, శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా జె. అశోక్‌కుమార్, గౌరవాధ్యక్షులుగా పాండు, యాదయ్య, మల్లయ్య, మల్లేష్ తదితరులను ఎన్నుకున్నారు.

చౌదరిగూడ : మిషన్ భగీరథ నీటి సరాఫరాలో అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. కొందుర్గు మండల కేంద్రంలోని రైతు వేదికలో మిషన్ భగీరథ వాటర్ మెన్‌లకు 4రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

యాచారం/మంచాల : కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ మండలంలోని మాల్ గ్రామపంచాయతీ కార్మికులకు దసరా పండగ పురస్కరించుకొని నూతన దుస్తులు పంపిణీ చేశారు. అదేవిధంగా దసరా పండుగను పురస్కరించుకుని మంచాల మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ దండేటికార్ రవి చేతుల మీదుగా నోముల గ్రామపంచాయతీ సిబ్బందికి శుక్రవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, అక్టోబరు 4 : పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతోపాటు సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. మండలాధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, పాండుగౌడ్, నాయకులు, కార్యకర్తలున్నారు.

ఎస్సీ వర్గీకరణపై జాప్యం తగదు



మాట్లాడుతున్న నర్సింహ మాదిగ

షాద్‌నగర్‌అర్బన్, అక్టోబరు 4: ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీరుపై రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తే ఆందోళనలు తప్పవని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నర్సింహమాదిగ తెలిపారు. షాద్‌నగర్ విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశానికి నర్సింహతో పాటు మదిలేటి మాదిగలు హాజరై మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటంతో ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై నేటి వరకు సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడం లేదని అన్నారు. సీఎం నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఈనెల 9న జిల్లా, తాలుకా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రశాంత్ మాదిగ, కృష్ణమాదిగ, భానుప్రసాద్‌మాదిగ, అనంతయ్య మాదిగ, అశోక్‌మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

● పశువులు మేపుతుండగా గుర్తుతెలియని దుండగుడి అఘాయిత్యం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 4: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి రాందాస్‌పల్లి వద్ద శుక్రవారం పొలంలో పశువులను మేపుతున్న ఓ మహిళ మెడలోంచి గుర్తుతెలియని దుండగుడు రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో శేరిగూడకు చెందిన భారతమ్మ రాందాస్‌పల్లి దగ్గర ఉన్న తన పొలంలో పశువులను మేపుతుండగా.. బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు (పుస్తెల తాడు)ను ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ చెప్పారు.

గొర్రెలకాపరులపై దాడి.. ఇద్దరిపై కేసు

చేవెళ్ల, అక్టోబరు 4 : బతుకుదెరువు కోసం గొర్రెలను మేపుతూ వలస వచ్చిన గొర్రెలకాపరులను చితకబాదిన వ్యక్తులపై చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ భూపాల్ శ్రీధర్ కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లాకు చెందిన గొల్ల చంద్రప్పతో పాటు మరికొంత మంది గొర్రెలను మేపుతూ చేవెళ్లకు వచ్చారు. గురువారం సాయంత్రం పామెన శివారులో గొర్రెలను మేపుతుండగా చేవెళ్ల గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు వారిపై దాడిచేశారు. ఇటు వైపు ఎందుకు వచ్చారటూ గొర్రెలను, గొర్రెలకాపరులను కర్రలతో చితకబాదారు. దాంతో గాయపడిన కాపరులు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కురుమ సంఘం నాయకులు శుక్రవారం చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో దాడి చేసిన వ్యక్తులపై ఫిర్యాదు చేశారు.

అపహరణకు గురైన సెల్‌ఫోన్ రికవరీ

● బాధితుడికి అప్పగించిన పోలీసులు

కేశంపేట, అక్టోబరు 4: అపహరణకు గురైన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు శుక్రవారం బాధితుడికి అందజేశారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం దేవునిపడకల్‌కు చెందిన కల్లెపు శివ సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఎక్కడ ఉందన్న విషయాన్ని గుర్తించారు. ఈమేరకు ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేశారు.

పిడుగుపాటుకు ఏడు గొర్రెలు మృత్యువాత

మంచాల, అక్టోబరు : పిడుగుపాటుకు ఏడు గొర్రెలు మృతిచెందిన సంఘటన మంచాల పోలీస్ స్టేషన్ పరిధి బండలేమూర్‌లో జరిగింది. బండలేమూర్‌లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఈ క్రమంలో గొర్రెల కాపరి మల్లం దశరథ తన మందను మేపడానికి తీసుకెళ్లి తిరుగుప్రయాణంలో గ్రామశివారు దసరాబండ వద్దకు చేరుకోగానే పిడుగు పడింది. దాంతో మందలోని ఏడు గొర్రెలు మృతిచెందాయి. మరికొన్నింటికి తీవ్రగాయాలయ్యాయి. గొర్రెల కాపరి కూడా గాయపడటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని మాజీసర్పంచ్ పోచమోని కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు.

విదేశాల్లో చదువు.. గోవా నుంచి డ్రగ్స్ దందా

● నగరంలో గంజాయి, ఓజీకుష్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పలుమార్లు జైలుకు వెళ్లినా తీరుమార్చుకోకుండా గంజాయి, ఓజీ కుష్ విక్రయిస్తున్న అంతరాష్ట్ర పెడ్లర్‌ను మహేశ్వరం ఎస్వోటీ సిబ్బంది అరెస్ట్ చేశారు. అతడి నుంచి స్థానిక గంజాయితోపాటు ఖరీదైన ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముంబై బాంద్రావెస్ట్‌కు చెందిన రోమీ భరత్ కళ్యాణి అలియాస్ రోమీ కొంతకాలంగా గంజాయి దందా చేస్తున్నాడు. పదోతరగతి వరకు ముంబైలో చదువుకున్న రోమీ ఇంటర్ థాయ్‌లాండ్‌లో.. ఉన్నత విద్య అమెరికా, దుబాయ్‌లలో పూర్తి చేసుకున్నాడు. విదేశాల్లో చదువుకున్న సమయంలో డ్రగ్స్‌కు అలవాటయ్యాడు. ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయడం ప్రారంభించాడు. డ్రగ్స్‌కు బానిసైన రోమీ తర్వాత. కొనుగోలు చేయడంతోపాటు అవసరమున్న వారికి ఎక్కువ ధరకు డ్రగ్స్ విక్రయించడం ప్రారంభించాడు. ఇతడు కేరళకు చెందిన టోబీ నుంచి డ్రగ్స్, గంజాయి తక్కువ ధరకు కొని, నగరంలో ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నాడు. గంజాయి విక్రయిస్తున్న ఇతడిని ముంబై బాంద్రా పోలీసులు 2004లో అరెస్ట్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి యత్నించిన ఇతడిపై 2013లో ముంబై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. దాంతో రోమీ తన మకాం గోవాకు మార్చాడు. గోవాలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇతడిని అంజునా పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. నగరంలో గంజాయి విక్రయాలు చేస్తున్న ఇతడిని ఈ ఏడాదిలో పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. జైలు నుంచి ఆగస్టులో బెయిల్‌పై వచ్చిన ఇతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో తిరిగి దందా ప్రారంభించాడు. బెంగళూరు గోవా, పూణే తదితర ప్రాంతాలకు వెళ్లి గంజాయి, ఖరీదైన ఓజీ కుష్‌ను కొనుగోలు చేశాడు. ప్రైవేటు బస్సులో నగరానికి చేరుకున్న ఇతడు కస్టమర్లకు సరఫరా చేసేందుకు తుక్కుగూడ వైపుకు వెళుతున్న ఇతడిని మహేశ్వరం ఎస్వోటీ సిబ్బంది అరెస్ట్ చేశారు. ఇతడి వద్ద నుంచి 1.50 కిలోల గంజాయి, 50 గ్రాముల ఓజీ కుష్, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కల్తీ కల్లు తయారీ కేంద్రంపై ఎస్వోటీ దాడులు


కడ్తాల్, అక్టోబరు 4 : మండలంలోని సరికొండ గ్రామంలో గురువారం కడ్తాల పోలీసులు, ఎస్వోటీ సిబ్బంది కల్తీ కల్లు తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించారు. కల్తీ కల్లు తయారీకి ఉపయోగించే వస్తువులు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. సరికొండలో కల్తీ కల్లు తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్వోటీ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన పాలకూర్ల రాఘవేందర్ ఇంటిపై దాడిచేసి బొలెరో వాహనంలో నాలుగు డ్రమ్ముల కల్తీకల్లును గుర్తించారు. అలాగే దాని తయారీకి ఉపయోగించే 2కిలోల అమ్మోనియం బైకార్బోనేట్ పౌడర్‌ని పట్టుకున్నారు. రాఘవేందర్ గ్రామంలో కొంత కల్లు సేకరించి దానికి అమ్మోనియం బైకార్బోనేట్ పౌడర్‌తో పాటు సిట్రిక్ యాసిడ్ కలిపి కల్తీ కల్లు తయారు చేసి అధిక లాభాల కోసం హైదరాబాద్ పంపుతున్నట్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఈమేరకు రాఘవేందర్‌పై కేసు నమోదు చేసి బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నామని సీఐ శివప్రసాద్ తెలిపారు.

ప్రజలను వంచిస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వం

● బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 4: అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను నిలువునా వంచిస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమైన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.2లక్షల రైతు రుణమాఫీపై దేవుళ్లపై ఒట్టేసి సంపూర్ణ రుణ మాఫీ చేయకుండా మాట తప్పారని, రైతులు వారికి బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు, 13 హామీలను నెరవేరుస్తామని ఆశలు చూపి ఏరుదాటి తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు రైతు బంధు పంటసాయంగా అందజేసిందని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి నేటికీ నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. రుణ మాఫీ కోసం సగం మంది రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారని వంకలుపెట్టి ఎగవేయాలని చూస్తే రైతులతో కలిసి తిరగబతామంటూ ఆయన హెచ్చరించారు. అన్ని పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, నాయకులు చీరాల రమేష్, ఆకుల యాదగిరి, ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, అరవింద్ తదితరులున్నారు.

సమృద్ధిగా వర్షాలు.. గంగమ్మకు పూజలు



సకాలంలో వర్షాలు కురిసి చెరువు నిండడం తమకు ఎంతో సంతోషంగా ఉందని, తమ జీవనోపాధికి ఢోకా లేకుండా పోయిందని కొత్తగూడ గ్రామ ముదిరాజ్ సంఘం, మత్స్యకార సంఘం అధ్యక్షుడు తాళ్ల నర్సింహ అన్నారు. శుక్రవారం ఆ సంఘం సభ్యులతో కలిసి కొత్తగూడ సున్నం చెరువులో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. గత ఐదేళ్ల నుంచి చెరువులు, కుంటల్లో తమ సంఘం ద్వారా చేపపిల్లలను పెంచడంతో జీవనోపాధి దొరకుతుందన్నారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు. - కందుకూరు, అక్టోబరు 4